తొక్కిసలాట ఘటనపై సీఎం ఆగ్రహం

న్యాయ విచారణకు ఆదేశం - ఇద్దరు అధికారులు సస్పెన్షన్

ఎస్పీ, సి వి ఎస్ ఓ, జేఈవో బదిలీ - దుర్ఘటన ప్రాంతాన్ని పరిశీలించిన చంద్రబాబు

ఆసుపత్రిలో గాయపడ్డ వారికి పరామర్శ - బాధితులకు ధైర్యం చెప్పిన సీఎం

- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు,
- ఇంటికో ఉద్యోగం, గాయపడ్డ వారికి రూ.2 లక్షలు

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

శుక్రవారం 10 జనవరి 2025 — 8 పేజీలు

వేంకటేశా...! ఏమిటిది...?

రోదనలతో మిన్నంటిన రుయా - పద్మావతిలోనూ కన్నీటి వ్యథలు

- వార్తలు మెయిన్, లోపలి పేజీల్లో

వైకుంఠ ఏకాదశి పర్వదినాన ఏడుకొండల మీద కొలువుదీరిన వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటే పుణ్యం ప్రాప్తిస్తుందనే ఆశ, ఆత్రుత ఆరు మంది ప్రాణాలు తీసింది. రుయా ఆస్పత్రి ఆవరణంలో మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. పద్మావతి, స్విమ్స్ ఆస్పత్రిలోనూ ఇవే కన్నీటి వ్యథలు కనిపించాయి. అయిన వారు తమ కళ్లముందే ప్రాణాలు విడువడంతో... వారి బంధువులు దిక్కులు పిక్కటిల్లేలా రోధించారు. వేంకటేశా..! ఏమిటిది స్వామీ...? అంటూ భక్తులు రోధిస్తుంటే చూపరులు సైతం కన్నీటి పర్యంతమయ్యారు. ఇంటి వద్ద ఏం సమాధానం చెప్పాలంటూ కొందరు దుఃఖిస్తుంటే పరామర్శకు వచ్చిన వారి మనసు చలించి పోయింది. తిరుమల చరిత్రలో ఏనాడూ జరగని ఘోర ఘటన చూసి భక్తులు తల్లడిల్లి పోయారు.

ప్రభుత్వం తరపున క్షమాపణ

పోలీసుల వైఫల్యం పై ఫిర్యాదులు
టిటిడి అధికారులదే బాధ్యత
డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

పోలీసుల వైఫల్యంతోనే దుర్ఘటన

- మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షలు ఇవ్వాలి
- మాజీ సీఎం జగన్ డిమాండ్

సమన్వయ లోపంతోనే

తిరుపతి దుర్ఘటన

- మృతులకు రూ.25లక్షలు పరిహారం చెల్లించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

తిరుమల తిరుపతి దేవస్థానం, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగానే తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనం టికెట్లు జారీ చేసే కౌంటర్ల వద్ద తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు దుర్మణం చెందారని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అభిప్రాయపడ్డారు. తొక్కిసలాటలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25లక్షలు, గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ.5లక్షలు వంతున పరిహారం చెల్లించాలని రామకృష్ణ డిమాండు చేశారు.

... వార్త మెయిన్‌లో ...

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు

పోరాటం

- ఎర్రజెండా నీడన ఉంటేనే పీడిత వర్గాలకు న్యాయం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

సాధారణ ఎన్నికల సందర్భంగా ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటం చేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రకటించారు. ఎర్రజెండా నీడన ఉంటేనే పీడిత వర్గాలకు న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

వార్త మెయిన్‌లో

మృతుల కుటుంబాలకు
రామచంద్ర యాదవ్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పుంగనూరు: మృతుల కుటుంబాలకు రూ.50 వేలు, క్షతగాత్రులకు తక్షణ ఆర్థిక సాయాన్ని బిసివై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ అందజేశారు.

మైనారిటీ కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండలం వింజం గ్రామపంచాయతీ ఆవలాపూర్ గ్రామంలోని మైనారిటీ నాయ కులు నూర్ భాషా సతీమణి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హిట్లర్ తల్లి షబీర భాను అనారోగ్య కారణంగా బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనగంటి హరికృష్ణ గురువారం ఆవలాపూర్ గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. బాదిత కుటుంబాన్ని పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామక్క, ఎంపీటీసీ హనీఫ్ బాషా, మాజీ సర్పంచ్ గోవిందయ్య, నగేష్ కుట్టి ఖాదర్ బాషా భాను దేవా వెంకటేశ్వర్ రెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేనేత సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేయాలి : మిద్దెలహరి

వైస్ ఛైర్మన్, ఆప్కో మాజీ డైరెక్టరు మిద్దెల హరి కోరారు. శ్రీకాళహస్తి పట్టణం నగరివీధిలో గల తన కార్యాలయంలో గురువారం ఆయన చేనేత కార్మిక యూనియన్ ముద్రించిన 2025 కాలమాన పట్టికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ... చేనేత కార్మిక యూనియన్ 34ఏళ్లుగా చేనేత సంక్షేమానికి, అభివృద్ధికి, సంరక్షణకు పనిచేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సమస్యలను గుర్తించి... వారికి సంక్షేమ పథకాల అమలు చేయాలన్నారు. చేనేత కార్మికులకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్తు అమలు చేయాలని ఆయన కోరారు. గత ప్రభుత్వం అమలు చేసిన వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని ఎన్టీఆర్ నేతన్న నేస్తం పథకంగా మార్చి ఏడాదికి రూ.30వేలు ఒక్కో కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పథకం వలన చేనేత కార్మికుల ఎంతో ఉపయోగ ఉంటుందన్నారు. చేనేత కార్మిక కుటుంబాలకు ఆరోగ్య భీమా ఇవ్వాలన్నారు. మూడు సెంట్లు స్థలం ఇచ్చి...రూ. 7లక్షలతో గృహం, వర్క్ షెడ్ పథకం అమలు చేయాలన్నారు. పట్టు, నూలు, జరీ పై 50శాతం రాయితీ ఇవ్వాలన్నారు. రాయితీతో కూడిన ముద్ర రుణాలు ఇవ్వాలని మిద్దెల హరి కోరారు. ఈ సమావేశంలో చేనేత కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆకుల వాసు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. షణ్ముగ వర్మ, కోశాధికారి ఎం. వెంకటముని, ఉపాధ్యక్షులు ఎర్ర హేమ భూషణం, స్థానిక చేనేత నాయకులు బొజ్జా ప్రభాకర్, బి వాసు, బి నాగార్జున, పి నారాయణ, సి.చెన్నయ్య, ఎస్.శంకరయ్య, జీ వీ నాగేశ్వరరావు, వై ముని రాజా, పి శేషయ్య, ఎస్ గురు నాథం పద్మశాలి పేట, భాస్కర పేట, దామానెల్లూరు గ్రామాల చేనేత కార్మికులు పాల్గొన్నారు.

భక్తుల మృతికి బాధ్యులైన టీటీడీ చైర్మన్, ఇఓ లను విధులు నుండి తొలగించాలి

విశాలాంధ్ర పలమనేరు : తిరుపతి తిరుమల దేవస్థానం ఆవరణలో వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కోసం జరిగిన తొక్కిసలాటలో 6 మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన టీటీడీ చైర్మన్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను బాధ్యులు చేస్తూ వెంటనే విధుల నుంచి తొలగించాలని జాతీయ మానవ హక్కులు అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి. మునిరత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా గురువారం పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయం నందు సరస్వతి అధ్యక్షతన తిరుమల పై జరిగిన సంఘటన గురించి సమావేశం నిర్వహించి మృతులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టీటీడీ సిబ్బందితో పాటు పోలీసులు అజాగ్రత్త వలన నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కొండపై భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో టిటిడి చైర్మన్, ఈవోలు ఏసీ రూముల్లో కూర్చొని ఏమి చేస్తున్నారని నిలదీశారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని పోలీస్ అధికారులు అదనపు బలగాలను సమకూర్చాల్సి ఉందని అలా చేయకనే భక్తులు తొక్కి సలాటకు గురికావాల్సి వచ్చి ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇప్పటివరకు తిరుమల కొండపై స్వామివారి సన్నిధిలో ఇలాంటి సంఘటనలు జరగలేదని గుర్తు చేశారు. ఈ సంఘటనతో భక్తులు భయాందోళనకు గురి అవుతున్నారని, కొండపై ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైనారనే ఈ సంఘటనతో తేట తెల్లమవుతున్నదన్నారు. గతంలో కూడా ఇలాంటి వైకుంఠ ద్వార దర్శనాలు చేపట్టినప్పుడు ఇంత పెద్ద ఎత్తున తొక్కిసలాటలు జరిగి ప్రాణాలు కోల్పోలేదని అధికారుల వైఫల్యాలే బలమైన కారణం అనడానికి జరిగిన సంఘటన నిదర్శనం అన్నారు. ప్రభుత్వం, టీటీడీ బోర్డు వెంటనే స్పందించి మృతుల ఒక్కొక్క కుటుంబానికి కోటి రూపాయలు చొప్పున పరిహారం ఇవ్వాలని, ఆ కుటుంబాల్లో ఒకరికి తిరుమల కొండపై ఉద్యోగం ఇవ్వాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం తో పాటు 10 లక్షలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలన్నారు. డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాంబశివ, సుబ్రహ్మణ్యం, దేవరాజ్, గాయత్రి, శ్యామల, గంగిరెడ్డి, ఆనంద్, గంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

వాడీ వేడిగా పెద్దపంజాణి మండల సర్వసభ్య సమావేశం

ఎంఈఓల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీటీసీ

విశాలాంధ్ర - పెద్దపంజాణి : పెద్దపంజాణి మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీపీ రెడ్డెప్ప అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా మండల విద్యా శాఖ పనితీరుపై వాడీ వేడిగా చర్చ జరిగింది. వీరప్పల్లి ఎంపీటీసీ కెలవాతి సుబ్రమణ్యం మండల విద్యాశాఖ అధికారులు వ్యవహరి స్తున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దపంజాణి మండల విద్యాశాఖలో చాలా సమస్యలు ఉన్న వాటిని పక్కన పెట్టి ఉపాధ్యాయ సంఘాల మధ్య చిచ్చుపెట్టేలా మండల విద్యా శాఖ అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నా రని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు చదువులో వెనుకబ డుతున్నారని దీనిపై వెంటనే విద్యాశాఖ అధికారులు స్పందిం చాలన్నారు.మండలంలో విద్యాశాఖ అధికారుల పనితీరుపై దినపత్రికల్లో కథనాలు రావడం ఆయన ముఖ్యంగా ప్రస్తావిం చారు. వీరప్పల్లిలో నాడు నేడు పనులలో నిధులు దుర్వి యోగం అయ్యాయని వీటి పై ఎలాంటి చర్యలు తీసుకున్నారని విద్యాశాఖ అధికారులను ప్రశ్నించారు.మండలంలోని డ్వాక్రా గ్రూపులు చాలా డిఫాల్ట్ లో ఉన్నాయని వాటిని కూడా సంబం ధిత అధికారులు స్పందించి ఆక్టివ్లో ఉండేలా చర్యలు తీసుకో వాలని కూడా వీరప్పల్లి ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం అధికారులను కోరారు. వీటిపై స్పందించిన విద్యాశాఖ అధికారులు సమస్యను ఇప్పుడే మా దృష్టికి వచ్చిందని వీటిపై ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీపీ రెడ్డప్ప, ఎంపీడీవో బాలాజీ, ఇఓపిఆర్డి, పెద్దపంజని మండల ఎంఈఓ 1 ఎంఈఓ 2, మిగతా అన్ని శాఖల అధికారులు, సర్పంచులు , ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశికి సర్వం సిద్ధం

- ఏర్పాట్లపై సమీక్షించి దగ్గరుండి పరిశీలించిన చెవిరెడ్డి

సామాన్య భక్తులకు సకాలంలో స్వామి దర్శనం కలిగించేలా చర్యలు - క్యూలైన్లలో భద్రతా పరమైన చర్యలపై ప్రత్యేక శ్రద్ధ





విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం జరిగే వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరిం చుకుని సర్వం సిద్ధం చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గురు వారం అన్ని ఏర్పాట్లుపై సమీక్ష చేశారు. ప్రధాన ఆలయంతో పాటు వైకుంఠ ద్వారం మొత్తం పువ్వులతో అకట్టునేలా అలంకరణ చేశారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తుల రద్ధీకి తగ్గట్టుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు, ప్రధాన ఆలయం ముందు భద్రతా పరమైన చర్యలు చేపట్టి ఎక్కడా తోపులాట, తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేకం గా కళావేదికను ఏర్పాటు చేశారు. వైకుంఠ ద్వారం గుండా వచ్చి శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునే భక్తులు అందరికీ తీర్థంతో పాటు అన్నప్రసాదాలు నిరంతరాయంగా అందించేలా చర్యలు తీసుకున్నారు. ఎప్పటి లాగానే వైకుంఠ ద్వారానికి అలంకరించే పువ్వుల విషయంలో సుంగద భరిత పుష్పాలు, పరిమళ భరిత పత్రాలను ఉపయోగించి భక్తులను ఆకట్టుకునేలా చేశారు. చివరగా తుమ్మల గుంట గ్రామ శివార్లలో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి అక్కడ మాత్రమే పార్కింగ్ చేయించాలని ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు లోపలికి రాకుండా చూడాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఆలయ ఈవో సుబ్రమణ్యంరెడ్డి, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయం 4 గంటలకు వైకుంఠ ద్వార ప్రవేశం..!

తుమ్మల గుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వైకుంఠ ద్వార ప్రవేశం శుక్రవారం ఉదయం 4 గంటల నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పష్టం చేశారు. భక్తులు అందరూ నెమ్మదిగా స్వామి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని స్పష్టం చేశారు. భక్తులు ఆలయ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చదువుకున్న గిరిజనులకు బ్యాక్‌లాగ్ పోస్టులు అందడం లేదు

- ఎస్టి కమిషన్ సభ్యుడు ఎదుట నిరుద్యోగ గిరిజనులు ఆవేదన

విశాలాంధ్ర-సత్యవేడు: చదువుకున్న గిరిజన యువతి, యువకులకు బ్యాక్ లాగ్ పోస్టు అందని ద్రాక్షగా మారిందని తిరుపతి జిల్లా సత్య వేడు పట్టణం బీసీ కాలనీ గిరిజన నిరుద్యోగ యువకుడు రామకృష్ణ ఆరోపించారు. గురువారం స్థానిక బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వాదిత్య శంకర్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మంజుల రమేష్ అధ్యక్షత, తహసిల్దార్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో చంద్రశేఖర్ పర్యవేక్షణలో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ ఎదుట పలు సమస్యలపై బీసీ కాలనీ గిరిజనులు ప్రస్తావించారు. సార్ బిఏ, బిఈడి చదువుకున్నాం కానీ ఉద్యోగం రాలేదు. కనీసం బ్యాక్ లాగ్ పోస్టులన్నీ ఎటు పోతుందో తెలియడం లేదు.బతుకుతెరువు కోసం తాను ఇప్పుడు శ్రీసిటీ కంపెనీలో పనిచేస్తున్నట్టు గిరిజనుడు రామకృష్ణ ఆవేదనను వెలగక్కారు. పాఠశాల గదిలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రానికి భవన వసతి కల్పించాలన్నారు. తమ కాలనీలో సిమెంటు రోడ్లను నిర్మించి డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఒక్కో ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఉండడంవల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అర్హులైన వారికి ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయాలని ఎస్టి మహిళ భువనేశ్వరి విన్నవించడం జరిగింది.అలాగే కాలనీలో తాగునీటి వసతిని కల్పించడంతో పాటు అర్హులైన వారికి సామాజిక భద్రత పింఛను,రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, మంజూరయ్యేలా చూడాలని విన్నవించారు.అలాగే బీసీ కాలనీలో ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాల స్థాయిని హైస్కూల్ స్థాయికి పెంచాలని పలువురు గిరిజనులు విన్నవించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులను అన్ని విధాల ఆదుకోవడానికి కమిషన్ ఎప్పుడు అండగా ఉంటుంద న్నారు. 15 రోజుల్లోపు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అర్హత ఉన్న ప్రతి ఒక్క గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయడానికి చర్యలు చేపట్టాలని తహసిల్దార్ సుబ్రమణ్యంకు సూచించారు. వచ్చే ఏడాది నుంచి ఇక్కడ ఉన్న స్కూలు స్థాయిని పెంచి విద్యా వసతిని కల్పిస్తామన్నారు. అలాగే జలజీవన్ మిషన్ పథకంలో గిరిజన కుటుంబాలకు కొళాయి కనెక్షన్ ఇప్పించి తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామన్నారు. 20 మంది పిల్లలు ఉన్న చోట మినీ అంగడి వాడి కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుం దన్నారు. ప్రధానంగా గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పనకు సబ్ ప్లాన్ కింద ఆరు శాతం నిధులను వెచ్చించాల్సి ఉన్నట్టు ఆయన స్పష్టం చేశారు.అంతకుమునుపు ఎస్టి కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ దాసుకుప్పం ఎస్టీ కాలనీలో పర్యటించారు. గిరిజనులు నివసి స్తున్న పూరిండ్లులోకి వెళ్లి అక్కడ సమస్యలను ఆరా తీశారు. రేషన్ కార్డులు,పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరారు. తదనంతరం కొత్తమారికుప్పం ఎస్టి కాలనీ పర్యటనలో స్మశాన వాటిక లేదని విన్నవించుకోవడంతో వారం లోపు స్మశాన భూమిని గుర్తించి,ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసి గిరిజనులకు రికార్డు అప్పగించాలని ఎస్టి కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్ రెవెన్యూ అధికారులను కోరారు. చుక్కల భూములకు సంబంధించిన సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కలెక్టర్ ద్వారా పరిష్కరిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవి,గూడూరు అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ అధికారి బేబీరాణి, స్థానిక ఏఎస్ డబ్ల్యూ కృష్ణ,వెలుగు ఏపీఎం డాక్టర్ డాంగే యాదవ్, కోఆర్డినేటర్ పయని, శివకుమార్, డాక్టర్ గుణశేఖర్, ఎంపిహెచ్ఈఓ సుబ్రమణ్యం, ఎంపిటిసి మోహన్ రెడ్డి టిడిపి యూనిట్ ఇన్చార్జ్ దిలీప్, టిఎన్ఎస్ రాష్ట్ర సెక్రటరీ పృథ్వీరాజ్, దాసుకుప్పం లోకయ్య రెడ్డి,షణ్ముగం, శివానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించండి

- రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్

విశాలాంధ్ర -చిత్తూరు : వార్డు సచివాలయాల పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పీజీఆర్ఎస్, ఆన్ లైన్ ద్వారా అందే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పి.విశ్వనాథ్ అధికారులను, వార్డు కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన నగరపాలక సంస్థ పరిధిలో 49వ వార్డు తిమ్మసముద్రం సచి వాలయాన్ని తనిఖీ చేశారు. వార్డు సచివాలయం పరిధిలో పన్నుల వసూళ్లపై సమీక్షిం చారు. డిమాండ్, ఇప్పటివరకు చేసిన వసూళ్లు, బకాయిలు, దీర్ఘకాలిక బకాయిల వ సూళ్లపై ఆరా తీశారు. పట్టణ ప్రణాళిక విభాగం సంబంధించి దరఖాస్తులు, అనుమ తుల మంజూరు అంశాలను పరిశీలించారు. వార్డు సచివాలయంలో కార్యదర్శులు హాజర నమోదు, మూమెంట్ రిజిస్టర్, పబ్లిక్ సర్వీసెస్ రిజిస్టర్లను తనిఖీ చేశారు.వార్డు సచివాలయానికి వచ్చే ప్రజలతో సామరస్యంగా మాట్లాడి వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని, పన్నులను పూర్తిస్థాయిలో వసూలు చేయడం ద్వారా నగరపాలక ఆదాయం పెంచాలన్నారు. ఆర్డీ వెంట కమిషనర్ పి నరసింహ ప్రసాద్, ఇతర అధికారులు ఉన్నారు.

శ్రీచైతన్యలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-తొట్టంబేడు: శ్రీకాళహస్తి పట్టణ శివారులో ధర్మరాజులస్వామి ఆలయం వద్ద గల శ్రీచైతన్య పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇదులో భాగంగా పాఠశాల విద్యార్థులచే తెలుగు సంస్కృతి ఉట్టి పడే విధంగా సంప్రదాయ దుస్తులు ధరింప చేశారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేశారు. విద్యార్థులు పాటలు పాడుతూ నృత్యం చేశారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ముందు తరాలకు అందించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉపాధ్యాయులు కోరారు. కాగా సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థుల వస్త్రధారణ అందరినీ ఆకట్టుకుంది.

శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానములో హుండీ లెక్కింపు

విశాలాంధ్ర- చౌడేపల్లి : మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన బోయకొండ ఆలయం నందుగురువారము జరిగిన హుండీ లెక్కింపు నందు దేవస్థాన ఆదాయం 42 రోజులకు గాను నగదు రూపంలో రూ. 58,68,134.00, బంగారు 18 గ్రాములు, వెండి 420 గ్రాములు, ఫారెన్ కరెన్సీ - మరియు శ్రీ రణభేరి గంగమ్మ దేవస్థానము ఆదాయం రూ. 33,188.00 వచ్చినవి. సదరు లెక్కింపునకు దేవస్థాన ఉప కమీషనరు కార్యనిర్వహణాధికారి జె. ఏకాంబరం, పలమనేరు మరియు పుంగనూరు గ్రూపు దేవస్థానముల కార్యనిర్వహణాధికారి కమలాకర్ వారు, చౌడేపల్లి పోలీస్ సిబ్బంది, బ్యాంక్, దిగువపల్లి వారు మరియు దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేకు ఎంపిక కాబడిన లద్దిగం

విశాలాంధ్ర-చౌడేపల్లి: చౌడేపల్లి మండలముల నందు రీసర్వే కొరకు పైలట్ గ్రామం గా ఎంపిక కాబడిన లద్దిగం గ్రామంలో రీసర్వే పైన రైతుల కు గ్రమ సభ ఏర్పాటు చేసి అవగాహన కల్పించడం జరిగింది.. తదుపరి గ్రామం మొత్తం రీసర్వే బ్యానర్ తో ర్యాలీ కూడా జరపడం జరిగింది... ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిదులుగా డెప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే పలమనేరు కృష్ణమూర్తి తహసీల్దారు డిప్యూటీ తాసిల్దార్ మాధవి చౌడేపల్లి హనుమంతు లడ్డిగం వాటర్ యూజర్స్ అసోసియేషన్ చైర్మన్ రాజారెడ్డి సర్పంచ్ హాజరయ్యారు... మరియు సిబ్బంది మండల సర్వేయరు గుణశేఖర్, గ్రామం సర్వేయర్ విజయకుమార్,లు రెడ్డి రాజా మరియు రెడ్డెప్ప లు పాల్గొన్నారు.

జే.వి.వి.ఆధ్వర్యంలో గర్భిణీలకు భోజనాలు

విశాలాంధ్ర - గూడూరు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు మూలి కిషోర్ రెడ్డి దాతృత్వంలో ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు నిరుపేద గర్భిణీ స్త్రీలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, డాక్టర్ రాజా చేతులమీదుగా భోజనాలు పంపిణీ చేయడమైనది. ఈ సందర్భంగా డాక్టర్ షరీనా మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక వారు గత 10 సంవత్సరముల నుంచి నిరంతరాయముగా మా ఆసుపత్రికి వచ్చే పేద గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ చేయడం చాలా సంతోషకరమని గర్భిణీ స్త్రీలు కూడా ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకొని మంచి బిడ్డకు జన్మనివ్వాలని తద్వారా తల్లి బిడ్డ ఇద్దరు ఆరోగ్యంగా ఉంటారని ఉచిత డెలివరీ అయినట్లయితే ప్రభుత్వం వారు మీ ఖాతాలో ఐదువేల రూపాయలు జమ చేస్తారని చెప్పారు. ప్రతి ఒక్కరూ బ్యాంకులో ఖాతా కలిగి ఉండాలని చెప్పారు. జన విజ్ఞాన వేదిక వారి సేవలు అజరామరమని అలాంటివారు ఈ సమాజానికి ఎంతో అవసరమని వారి జాడల్లో అందరూ నడిస్తే ఒక మంచి సమాజం ఏర్పడుతుంది కాబట్టి వారి ఆశయాలను అందరం ముందుకు తీసుకుపోవాలని కోరారు.ఈ కార్యక్రమం దాత మూలి కిషోర్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్య క్రమంలో జనవిజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్ర సాద్, నాగరాజు, రామమోహన్, పురుషోత్త మరావు, ప్రభాకర్, సుబ్బా రావు, ఆనంద్, ఇబ్రహీం, బాబు, జగదీష్, శ్రీనివాసా చారి, సుమన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో టీడీఆర్ కమిటీ సమావేశం

విశాలాంధ్ర -చిత్తూరు : చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కమిషనర్ పి నరసింహ ప్రసాద్ అధ్యక్షతన టీడీఆర్ కమిటీ సమావేశం జరిగింది. సమావే శంలో భాగంగా కమిటీ సభ్యులు టీడీఆర్ జారీ అంశంపై చర్చించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా రికార్డులను పరిశీలించి, టీడీఆర్ జారీపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. సమావేశంలో టీడీఆర్ కమిటీ సభ్యులు ఏసీపీ నాగేంద్ర, తహశీల్దార్ కళావతి, సబ్ రిజిస్ట్రార్ విజయ్, చుడా పీవో మోహన్ ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-రేణిగుంట: బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాలతో రేణిగుంట గ్రామంలోని జ్యోతి నగర్ లో ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగా రోడ్డుకు అడ్డంగా ఉన్నటువంటి విద్యుత్ స్తంభంను తొలగించి ఎవరికి ఇబ్బంది లేకుండా పక్కన నూతన విద్యుత్ స్తంభం గురువారం నాడు ఏర్పాటు చేయడం జరిగింది. నూత న విద్యుత్ స్తంభంను ఏర్పాటు చేసినందుకు బొజ్జల సుధీర్ రెడ్డికి గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, కొరియర్ రవి, మేరీ, మొదలగు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజీఎంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా భోగి మంటలు వేసి... విద్యార్థులు పాటలు పాడుతూ వేడుకలు చేసుకున్నారు. సంక్రాంతి పండుగ ప్రాధాన్యత, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టరు గుడ్లూరు మయూర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాస్పరో స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని ప్రాస్పరో ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు స్కూల్ కరస్పాండెంట్ దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షులు రొటేరియన్ బండి శ్యామసుందర రావు(మయూరి శ్యామ్ యాదవ్), రొటేరియన్ తిరుమూరు సురేష్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సంక్రాంతి శోభ ఉట్టిపడేలా వివిధ రకాల సాంస్కృతి కార్యక్రమాలలో పాల్గొనడం జరిగింది. మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ భోగి సంక్రాంతి పండుగల విశిష్టతను నేటి తరం యువతకు తెలియజేసే విధంగా కార్యక్రమాలు చేపట్టిన విద్యార్థిని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. తిరుమూరు సురేష్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాన్ని నేటి తరం యువతకు తెలియజేసే విధంగా విద్యార్థుల చేత కార్యక్రమాలను రూపొందించన ప్రాస్పరో స్కూల్ వారికి అభినందనలు తెలియజేస్తున్నానని అన్నారు. ప్రాస్పరో స్కూల్ కరస్పాండెంట్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థుల సృజనాత్మక శక్తిని పెంపొందించి తద్వారా భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయికి వచ్చేదానికి అవకాశం ఉన్న కారణంగా పై కార్యక్రమాలు నిర్వహించి గెలుపొంది వారికి బహుమతులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యాంటోనీ, టీచర్స్, విద్యార్థినీ విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతి నేతలను అవమానిస్తున్న బీజేపీ

- కాంగ్రెస్ నేత తలపా దామోదరంరెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జాతిపిత మహాత్మాగాంధీ, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వంటి జాతి నేతలను బీజేపీ అవమానిస్తోందని కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ కమిటీ పిలుపు మేరకు గురువారం శ్రీకాళహస్తి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద 'జై బాపూజీ.. జై భీమ్... జై సంవిధాన్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తలపా దామోదరంరెడ్డి మాట్లాడుతూ... ప్రపంచ శాంతి దూతగా పిలవబడుతున్న మహాత్మాగాంధీని చులకన చేస్తూ బీజేపీ మాట్లాడుతోందన్నారు. బీజేపీ భారత రాజ్యాంగాన్ని అబాసు పాలు చేస్తోందన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాల గురవం బాబు మాట్లాడుతూ... పార్లమెంట్ సమావేశాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ ను అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలన్నారు. అదేవిధంగా హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండు చేశారు. బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ అనే కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. ఇది జనవరి 26 నుంచి ఏడాది పాటు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఇంచార్జి హరి, జిల్లా నాయకులు దాసరి రత్నం, అర్జున గురుమూర్తి, శబరి రెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కలిందర్, శ్రీకాళహస్తి పట్టణ నాయకులు కరీముల్లా, ఆంటోనీ, చందు, ముబారక్, ఖాదర్ భాషా, అరుణ్, నాగరాజు, దేవా, చిరంజీవి, శంకర్, మాన్, శ్రీకాళహస్తి మండల నాయకులు నవీన్, శశి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

కిశోరి వికాసంపై పుత్తూరు మండల స్థాయి శిక్షణ

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు మండలం మండల సమాఖ్య కార్యాలయం నందు కిషోరి వికాసం మండల స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం సూపర్వైజర్లు సంధ్య, గీతాంజలి, అనిత ఆధ్వర్యంలో నిర్వహించారు. కిశోరి వికాసం యొక్క ముఖ్య ఉద్దేశం బడి మానేసిన 11 నుంచి 18 సంవత్సరాల కిశోర బాలికల గ్రూప్ లు ఏర్పాటు చేసి వారికి ఆరోగ్యం, రక్షణ, బాల్య వివాహాలు సైబర్ క్రైమ్ తదితర అంశాల పైన అవగాహన కల్పించి ఆంధ్రప్రదేశ్ వృత్తి నైపుణ్యాభివృది సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చి వారి నైపుణ్య అభివృద్ధి పరిచి స్వయం ఉపాధి కలిగించడం మరియు బడి మానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించడంపై కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల అభివృద్ధి అధికారి కె.రమేష్ బాబు మాట్లాడుతూ పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు పిల్లల సంరక్షణ ఇంట్లో పెద్దలు, అవ్వ, తాతలు చూసేవారు. ప్రస్తుతం న్యూక్లియర్ ఫ్యామిలీ ఉన్నందున తల్లిదండ్రులు ఉద్యోగాలతో పిల్లల పై సంరక్షణ కొరవడింది నేరాలు ఎక్కువయ్యాయని తెలిపారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ ఎస్ఎం ప్రవీణ్ మాట్లాడుతూ టీనేజ్ ప్రెగ్నెన్సీ, రక్తహీనత, పౌష్టికాహారం మరియు నెలసరి సమయములో తీసుకోవలసిన జాగ్రత్తలు గురుంచి వివరించడం జరిగింది. మండల విద్యా శాఖ అధికారి బి.తిరుమల రాజు మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల బాలికలు చదువు మీద దృష్టి పెట్టాలని బాల్య వివాహాలు నివారణకు కృషి చేయాలని తెలియచేశారు. పోలీసు శాఖ వారు మాట్లాడుతూ సైబర్ నేరాలను గురుంచి బాలల అక్రమ రవాణా గురుంచి వాటిపై గల చట్టాలను గురించి వివరించడం జరిగింది. సూపర్వైజర్ కె.మనీలా పోక్సో చట్టం గురుంచి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కె.రమేష్ బాబు, మెడికల్ ఆఫీసర్ ఎస్ఎం ప్రవీణ్, ఎంఈఓ తిరుమలరాజు, ఈవోపీఆర్డి ఎస్.దేవకీ, సూపర్వైజర్స్ పి.సంధ్య, బి.గీతాంజలి, ఎం.అనిత, వై.రోజరమని, కె.మనీలా ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు ఎంఎస్‌కెలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు,అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొనటం జరిగింది.

చెన్నూరులో ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు మండల పరిధిలోని చెన్నూరు జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పాఠశాలలో విద్యార్థులు భోగి మంటలు వేసి, గాలిపటాలు ఎగురవేసారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల తల్లి దండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు మట్టం శ్రావణి రెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. ఈ సందర్భంగా మట్టం శ్రావణి రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంప్రదాయాలను గౌరవించాలని పేర్కొన్నారు. తెలుగు సంస్కృతి, పండుగల విశిష్టత గురించి విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలనాగమ్మ, ఉపాధ్యాయులు చిరంజీవి, మాజీ చేనేత కమిటీ చైర్మన్ కటికాల శ్రీనివాసులు, మధిర రాజనాల తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడే కాదు.. జంతు ప్రేమికుడు కూడా

విశాలాంధ్ర-రేణిగుంట: సాటి మనిషికి సాయం చేయాలన్న మంచి మనిషి షేక్ ఫరీద్ బాబా అంతేకాకుండా అతను ఒక జంతు ప్రేమికుడు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే నోరులేని ప్రాణిని పెంచి, పోషించడమే కాదు, అది చనిపోయాక అంత్యక్రియలు నిర్వహించి, సాంవత్సరీకం చేసిన అతి కొద్ది మందిలో డాక్టర్ షేక్ ఫరీద్ బాబా కుటుంబం ఒకటి.తిరుపతి జిల్లా, రేణిగుంటకు చెందిన ఎంఏ జబ్బార్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ షేక్ ఫరీద్ బాబా కుటుంబం తమ ట్రస్టు ద్వారా సమాజంలో అర్హులైన పేదలకు సామాజిక సేవ కార్యక్రమాలు చేయడమే కాకుండా, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న కవులు, కళాకారులను గుర్తించి వారిని సత్కరించడం, కుల మతాలకు అతీతంగా ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ సేవలు అందించడం వారి దినచర్యల్లో భాగంగా మారింది. అంతేకాకుండా ఆ కుటుంబానికి పశువులు, పక్షులు, పెంపుడు జంతువులన్నా కూడా అమితమైన ప్రేమ. తాము ఎంతో ప్రేమగా 13 ఏళ్ల పాటు పెంచి పోషించిన స్నూఫీ (కుక్క) మృతి చెంది మూడేళ్లు కావస్తున్నా దాన్ని తలచుకుంటూ, ప్రతి సంవత్సరం స్నూఫీ ఆత్మశాంతి కోసం ఆలయాలు, దర్గాలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం పరిపాటిగా మారింది. అదేవిధంగా గురువారం కూడా ఆ కుటుంబం తమ పెంపుడు కుక్క ఆత్మ శాంతిని కోరుకుంటూ ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు చేయడంతో పాటు పేదలకు అన్నదాన కార్యక్రమాలను కూడా నిర్వహించారు.

బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-చంద్రగిరి: చంద్రగిరి స్థానిక బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు కనులపండుగగా జరిగాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలు, పండుగకు సంబంధించిన చిత్ర లేఖనాలు, పచ్చని తోరణాలు మరియు పూలహారాల అలంకరణలతో గ్రామీణ ప్రాంతంలో సంక్రాంతిపండుగను తలపించేలా పాఠశాల సంతరించుకొని చూపరులకు కనువిందుచేసాయి. పౌరోహితుల వేద ప్రవచనాలతో విద్యార్థులను ఆశీర్వదించగా, భోగిమంటల సమక్షంలో తల్లిదండ్రులు భోగిపళ్లతో తమ తమ పిల్లలను దీవించారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల కరెస్పాండెంట్ బి.హితేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి అంటే సూర్యుడు మకరం రాశి లోకి చేరుతుంది కావున మకర సంక్రాంతి అంటారు, ఇది అన్ని పండుగలతో పోలిస్తే పెద్ద పండుగ, అన్నదాతల పండుగ. పాడి పశువుల పండుగ, మన పండుగ కాని నేటి ఆధునిక ప్రపంచం ఈ పండుగను కేవలం గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే పరిమితం అయ్యేలా చేసింది. దీనికి కారణం మనిషి మనిషికి మధ్య దూరం ఏర్పడటం, సంపాదన పైన ఉన్న మక్కువ బాంధవ్యాలపై ఉండకపోవడం ఒకప్పుడు ఉత్తరాల కాలంలో ప్రతి పండుగకు అందరు కలసి కట్టుగా చేసుకొనే వారు ఒకరిని ఒకరు చూసుకొనే వారు కాని ఇప్పుడు మొబైల్ ఫోన్ల రాకతో మొత్తం మారిపోయిందన్నారు. వీడియోకాల్స్, చాటింగ్స్ తో వ్యక్తిని మరచి మొబైల్ స్క్రీన్స్‌కి బానిసగా మారుతున్నారని తెలిపారు. టెక్నాలజీ పేరుతో సంప్రదాయాలను మరచిపోతున్నారని, ఈ పెద్దపండుగ గొప్పతనం ఎంటో చూస్తే భోగి మంట అంటే చలిని పారదోస్తూ ఇంటిలోని పాత వస్తువులను ఆ అగ్నిలోవేసి నూతన జీవిత ప్రారంబానికి సూచన, భోగి పండ్లు అంటే రేగుపండ్లు. ఇది సూర్యునికి ప్రీతిపాత్రమైన పండుగ. సూర్యుని రూపం, రంగు, పేరు కలిగిన రేగుపండ్లతో నాణేలను కలిపి పిల్లల తలపై పోస్తారు. సూర్య భగవానుని అనుగ్రహం పిల్లలపై ప్రసరించి ఆరోగ్యం కలగాలనే సంకేతం. ముగ్గులు అంటే రాళ్ళూ రప్పలూ లేకుండా ఒక పద్ధతిలో అలకబడిన నేల, మేఘాలు లేని ఆకాశానికి సంకేతం. ఒక పద్ధతిలో పెట్టబడు చుక్కలు రాత్రి వేళ కనిపించే నక్షత్రాలకు సంకేతం. చుక్కలచుట్టూ తిరుగుతూ చుక్కలను గళ్ళలో ఇమిడ్చే ముగ్గు ఖగోళంలో ఎప్పటికప్పుడు కనిపించే మార్పులకు సంకేతం. గొబ్బెమ్మలు అంటే పెద్ద వయసు స్త్రీలు ముగ్గులు పెడుతుంటే చిన్న వయసు ఆడపిల్లలు ఆవు పేడతో చేసి పెట్టే గొబ్బెమ్మలు కృష్ణుని భక్తురాళ్ళైన గోపికలకు సంకేతం. ఆ గోపికా స్త్రీల రూపాలకు సంకేతమే గోపింబొమ్మలు గొబ్బెమ్మలు. చివరగా కనుమ పండుగ అంటే వ్యవసాయంలో తమకు ఎంతో చేదోడువాదోడు ఉన్నందుకు పశువులకు శుభాకాంక్షలు తెలుపటానికి జరుపుతారు. ఇలా ప్రతి పండుగలోనూ ఎన్నో నిగూఢమైన శాస్త్రీయ విషయాలు దాగి ఉన్నాయి. అలాంటి వాటిని బావి తరాలకు అందించి బాసటగా నిలవడ మే బ్లూమింగ్ బడ్స్ ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం ఇంత విజయవంతంగా జరుగుటకు ముఖ్య కారణమైన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ మరియు బోధనేతర సింబందికి కృతజ్ఞతలు తెలిపారు.

సన్ రైస్ పాఠశాల ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని సన్ రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ముందస్తు మకర సంక్రాంతి సంబరాలు గురువారం కోలాహలంగా నిర్వ హించారు. ముఖ్యఅతిథిగా సన్ రైస్ ప్రమోటర్ డాక్టర్ శ్రీనివాసన్ (చెన్నై) హాజరయ్యారు.ఇందులో భాగంగా హై స్కూల్ చైర్మన్ ప్రియాంక, కరస్పాండెంట్ డాక్టర్ సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలలో పలువురు పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో విజేతలు మొదటి బహుమతి ప్రియాధనుజాకు 3000 రూపాయలు నగదు, పట్టుచీర, కప్పు రెండవ బహుమతి పరిమళ రామరాజు 2000 రూపాయలు నగదు, పట్టుచీర, కప్పు, మూడవ బహుమతి దివ్య వెయ్యి రూపాయలు నగదు, పట్టుచీర, కప్పును సన్ రైస్ ప్రమోటర్ డాక్టర్ శ్రీనివాసన్, కరస్పాండెంట్ సతీష్ ప్రధానం చేశారు. వీరితోపాటు ముగ్గులు పోటీలో పాల్గొన్న వారందరికీ పట్టుచీర కప్పును ప్రోత్సాహక బహుమతిగా అందించడం జరిగింది. అంతకుముందు ఉపాధ్యాయులు, విద్యార్థుల కోలాహలం మధ్య హైస్కూల్ ప్రాంగణంలో సాంప్రదాయ సిద్ధంగా పొంగల్ వండి భోగి మంటలు వేశారు.ఈ సందర్భంగా ప్రమోటర్ డాక్టర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ పండుగలలో మకర సంక్రాంతి ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సన్ రైస్ హై స్కూల్ ప్రిన్సిపాల్ ఆషా, ఉపాధ్యాయులు గోపాల్, ఉమ, హరినాధుడు, నిర్మల, పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జీ తెలుగులో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-తిరుపతి: జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా జీ వినియోగ దారులకు సరికొత్త కార్యక్రమాలను సిద్ధమైందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 6 గంటలకు విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతి సంబరాలకు వస్తున్నాం సినిమాను, 12వ తేదీ సాయంత్రం 5. 30 గంటలకు పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాను, 13 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమాలను ప్రసారం చేయనున్నామన్నారు. కాకినాడ వేదికగా జరిగిన 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' కార్యక్రమంలో జీ తెలుగు తారలతో పాటు ' విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి పాల్గొని అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన మోస్ట్ అవైటెడ్ గ్లోబల్ బ్లాక్ బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాని జీ తెలుగు అందిస్తోందన్నారు. ఈ సినిమా చూసే ప్రేక్షకులకు జీ తెలుగు వాచ్ అండ్ విన్ కాంటెస్ట్ని నిర్వహిస్తోం దన్నారు. జీ తెలుగు. మీరు చేయాల్సిందల్లా కల్కి సినిమా చూస్తూ టీవీ స్క్రీన్పై వచ్చే క్యూఆర్ కోడ్ని స్కాన్ చేయడం లేదా www.kalkionzeetelugu.zee5.com లో లాగిన్ అయి కల్కి గేమ్ ఆడి అదిరిపోయే బహుమతులు గెలవచ్చన్నారు. సంక్రాంతి సంబరాలకి కొనసాగింపుగా సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమం లో యాంకర్ రవి, వర్షిణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు, జీ తెలుగు తారలు అత్తలు, కోడళ్లు పేరున రెండు టీమ్లుగా ఏర్పడి వినోదం పంచేందుకు పోటీపడ్డారన్నారు. సాగిన ఈ కార్యక్రమాలను జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూడాలన్నారు.

తిరుపతి ఘటనపై బాధితులను పరామర్శించేందుకు వచ్చిన సీఎం, డిప్యూటీ సీఎం, మాజీ సీఎం

విశాలాంధ్ర-రేణిగుంట: వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం తిరుపతిలో జరిగిన ఘటనలో మృతుల కుటుంబ సభ్యులను, క్షతగాత్రులను పరామర్శించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడ నుంచి గురువారం రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. ఆయా పార్టీల నాయకులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వేరువేరుగా ప్రత్యేక కాన్వాయ్ లో తిరుపతికి బయలుదేరి వెళ్లారు. అంతకు ముందుగా వివిధ శాఖల మంత్రులు క్షతగాత్రులను పరామర్శించేందుకు తిరుపతికి చేరుకున్నారు.

హిందువులు సింహాల్లా గర్జిస్తే తట్టుకోలేరు

విశాలాంధ్ర-రేణిగుంట: హిందువులు గర్జిస్తే ఎలాంటి వారైనా తట్టుకోలేరని తిరుపతి జిల్లా కన్వీనర్ హిందూ చైతన్య వేదిక కుమారస్వామి గురువారం సాయంత్రం రేణిగుంట మండలం వెదలచెరువు ఎస్టీ కాలనీలో గ్రామసభ నిర్వహించి హిందువుల ఐక్యవేదిక వర్ధిల్లాలి అంటూ నినాదాలు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ జరుగుతున్న విషయాలు చాలా చాలా అన్యాయంగా ఉన్నాయని అన్నారు. ఒకటి వారు వారి మతం పట్ల గౌరవంగా చేసుకున్న పర్వాలేదని అన్నారు హిందూ ధర్మంలో మనం ఎప్పుడు పరమత సహనాన్ని ఆచరిస్తున్నామన్నారు. వారి ప్రార్థనలు ఇంటి దగ్గర చేసుకుంటే పర్వాలేదని అన్నారు. వారి ఇంట్లో చేసుకోవడమే కాకుండా ఇక్కడ ఉన్న కుటుంబాల్లో చిచ్చు పెట్టి మతమార్పిడి చేస్తున్నారని ఆరోపించారన్నారు. ఏదైనా వారికి ఆరోగ్యం బాలేక పోతే కుటుంబ సమస్యలు ఉంటే వారినీ మా మతంలోకి వస్తే ఆరోగ్యాలు బాగుపడతాయని చెప్పడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్య కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టా ఇచ్చారు..
మా స్థలం ఎక్కడ?

- ఎమ్మెల్యే బొజ్జలకు ఓ మహిళ ఫిర్యాదు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: మాకు పట్టా ఇచ్చారు. ఇంత వరకు స్థలం చూపించలేదంటూ ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి దృష్టికి ఓ మహిళ తీసుకొచ్చారు. శ్రీకాళహస్తిలోని ఊరందూరు జగనన్న లేఔట్ వద్ద గురువారం నిర్వహించిన విచారణ సదస్సులో ఆ మేరకు ఆ లబ్ధిదారురాలు తన మొరను వినిపించింది. అలాగే రేణిగుంటకు చెందిన మరో మహిళ కూడా ఇదే సమస్యను ఎత్తిచూపారు. ఇంకో మహిళ తమ ఇంటి నిర్మాణం స్లాబు వరకు వేసి అపేశారని చెప్పింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కాలనీలో సుమారు ఆరువేల ఇంటి స్థలాలకుపైగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ కూడా అక్రమాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. వీటి అంతు తేల్చడానికే ఈ విచారణ సదస్సును నిర్వహించి లబ్ధిదారులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. ఇక్కడకు వచ్చిన లబ్ధిదారులను బట్టి చూస్తే ఏ స్థాయిలో ఇంటి స్థలాల కేటాయింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయనే విషయాలు చెప్పకనే తెలుస్తోందన్నారు. మందికి ఇంకా స్థలాలు చూపించకుండా ఉండారనే విషయమై సమగ్రంగా వివరాలను పూర్తి స్థాయిలో సేకరించాలని అధికారులకు సూచించారు. ఎన్ఆర్ఐజీఎస్ కింద ఎంత మొత్తం నగదు మంజూరు అయ్యింది. గృహ నిర్మాణాలు ఎన్ని పూర్తయ్యాయి.. అసంపూర్తిగా వివిధ దశల్లో ఎన్ని నిర్మాణాలున్నాయనే వివరాలు అందించాలని తెలిపారు. అలాగే హౌసింగ్ పథకం ద్వారా పూర్తయిన, అసంపూర్తి నిర్మాణాలకు ఎంత మొత్తం చెల్లింపులు జరిగాయి.. మిగిలిన నగదు ఎంత వరకు లబ్ధిదారుల ఖాతాలో ఉందనే విషయాలను కూడా సేకరించి ఇవ్వాలన్నారు. నిష్పక్షపాతంగా అధికారులు సర్వే వివరాలను సమర్పించాలని ఆదేశించారు. విచారణ సదస్సుకు అనూహ్య స్పందన శ్రీకాళహస్తి ఊరందూరు గ్రామ సమీపంలో జగనన్న కాలనీలో గురువారం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి నిర్వహించిన విచారణ సదస్సుకు అనూహ్య స్పందన లభించింది. ఎమ్మెల్యే పిలుపును అందుకుని వందల సంఖ్యలో లబ్ధిదారులు ఇక్కడకు విచ్చేశారు. కొంత మందితో నేరుగా ఎమ్మెల్యే మాట్లాడి వారి సమస్య తెలుసుకున్నారు. ఆ వివరాలను నమోదు చేయించి విచారణకు ఆదేశించారు. మిగిలిన లబ్ధిదారుల సమస్యలు కూడా తెలుసుకుని వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి అధికార బృందాలను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తమ పట్ల చూపిన చొరవ పట్ల లబ్ధిదారుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ దగ్గు మల్ల ప్రసాద్ రావు జన్మదినం సందర్భంగా

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-కార్వేటినగరం: చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమల్ల ప్రసాదరావు జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం కార్వేటి నగరంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు పండ్లు టిడిపి నాయకుడు భద్రరాజు ఆధ్వర్యంలో జనార్దన్ రాజు, చంగల్రాయ్ యాదవ్, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు చెంగల్రాయ్ యాదవ్ మాట్లాడుతూ వృద్ధులకు దుప్పట్లు వితరణ చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులుజగన్నాథం, త్యాగరాజు, వాసుదేవ రెడ్డి, నటరాజు, లక్ష్మణ్ రాజు, పవన్ కుమార్, కె దామోదరం, మురళి, సోమశేఖర్, నౌషాద్, దాము, రాంబాబు రెడ్డి, చంగల్ రాయలు, ఏకాంబరం, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట లోని లయన్స్ క్లబ్ అఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యం లో గురువారం స్వామి వివేకానంద జయంతి (జాతీయ యువజన దినోత్సవం 2025) వేడుకల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సూళ్లూరుపేట లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు, అలాగే తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా వ్యాసరచన పోటీలు నిర్వహించి అక్కడ కూడా విజేతలైన విద్యార్థులకు లయన్స్ క్లబ్ తరుపున బహుమతులను అందించడం జరిగింది, లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ ఆదిశేషారెడ్డి, అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ రావు, ట్రెజరర్ అప్పారావు పర్యవేక్షణలో ఈ జాతీయ యువజనోత్సవాలను నిర్వహించడం జరిగింది.

బోవిన్ ఫార్మాస్యూటికల్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని గడ్డం వారి పల్లి పంచాయతీ చౌడగానిపల్లి గ్రామంలో గురువారం పశువైద్యాధికారి పవన్ కుమార్ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పశువులు వచ్చాయి. లేగాదూడలకు నట్టల నివారణ మందు తాగించడం జరిగింది. బాహ్య పరాన్న జీవులు నిర్మూలనకై భూటాక్ స్ప్రే చేయడం జరిగింది. పశువుల్లో ప్రథమ చికిత్సలు గర్భకోశ వ్యాధులు చూడి పరీక్షలు ఎదకు రాని పశువులకు మినరల్ మిక్చర్ పాకెట్లను రైతులకు అందజేశారు. రాబోయే వేసవికాలంలో పశువులకు కావలసిన పచ్చిమేత ధాన్యపు జాతి రకాలను రైతులు పండించాలని అప్పుడే పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోవిన్ ఫార్మాసూటికల్ సిబ్బంది పశువైద్య సిబ్బంది అనూష మౌనిక రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-పాకాల: స్థానిక పట్టణంలోని స్కై లైన్ ఆక్స్ ఫర్డ్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. శుక్రవారం నుంచి పాఠశాలకు సంక్రాంతి సెలవులు కావడంతో గురువారం పాఠశాల ఆవరణలో కరెస్పాండెంట్ పాలకూరు నాగేంద్ర ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో అందమైన ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు. అనంతరం భోగిమంటలు వేశారు. విద్యార్థులకు సంక్రాంతి పండుగ యొక్క విశిష్టతను వివరించారు. విద్యార్థులు ఈ కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల మృతి పై న్యాయ విచారణ చేపట్టాలి

మాజీ ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు పార్టీ ఆఫీసు నందు మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఎన్డిసిసిబి చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తిరుపతి పట్టణంలోని తిరుమల దర్శనం టిక్కెట్లు జారీ చేసే కేంద్రం వద్ద తొక్కిసలాటలో భక్తులు మృతి చెందిన ఘటన పై న్యాయ విచారణ చేపట్టాలని కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వైకుంఠ దర్శనం కోసం తిరుపతిలో టోకన్లు జారీ చేస్తున్న కేంద్రం వద్ద తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడం పై వారు తీవ్రమైన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం వచ్చిన భక్తులు ఇలా ప్రాణాలు కోల్పోవడం అత్యంత విచారకరమన్నారు. ఈ ఘాతుకానికి టీటీడీ, రాష్ట్ర ప్రభుత్వం యంత్రాంగమే బాధ్యత వహించాలని తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పోటీపడి వస్తారని అంచనా వున్నా, దానికి తగిన ఏర్పాట్లు చేయకపోవడం వల్లే ఈ విషాదకర ఘటన జరిగిందన్నారు. దీనికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారి కుటుంబాలు కోటి రూపాయలు చొప్పున ఆసుపత్రిలో ఉన్నవారికి మెరుగైన చికిత్స, ఆర్థిక సహాయం ప్రకటించాలన్నారు. మొత్తం ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రిస్కిల్లా, గంజి దయా కృష్ణ యాదవ్, రఘు నాయుడు, ఎల్లు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పూల కూలర్ వాడకంతో సంపంగి రైతులకు మేలు

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణవనం మండలం అరణ్యం కండ్రిగ రైతు సేవా కేంద్రం నందు జిల్లా ఉద్యాన అధికారి దాశరధరామి రెడ్డి, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్, పుత్తూరు ఉద్యాన అధికారి సౌజన్య, సంపంగి రైతుతో సబ్జీ/పూల కూలర్ గురించి చర్చించారు. సంపంగి పూలు రాత్రి వేళలలో కోయటం వలన పాము కాటు, ఇతర పురుగులు కుట్టటం వలన రైతులు ఇబ్బంది పడ్డున్నారు. దీనిని నివారించటానికి జీఎన్ కండ్రిగ లోని సంపంగి రైతులు ఒక 100 శాతం సబ్జీ కూలర్ని ఉపయోగించుకుంటూ రాత్రి పూట కాకుండా సాయంత్రం 4-5 గంటలకే పూలు కోసి కూలర్లో ఉంచుకుంటున్నారు. తెల్లవారు జామున మార్కెట్కి తారలిస్తున్నారు. దీని వల్ల అర్ధ రాత్రి పొలాల్లోకి వెళ్ళే సమస్య ఉండదు. అదే విధంగా కోసిన పువ్వులు ఫ్రెష్ గా నిలవ ఉంటాయని కూలర్ ఉపయోగిస్తున్న రైతు వెంకటేష్ తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉద్యాన అధికారి ఉద్యాన శాఖ ద్వారా కూలర్లను సంపంగి రైతులకు రాయితీతో ఇచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామని తెలిపారు. జిల్లా సూక్ష్మ సేద్య అధికారి సతీష్ మాట్లాడుతూ డ్రిప్ స్ప్రింక్లర్లు 90 శాతం రాయితీతో అందజేస్తున్నామని, కావాల్సిన వారు రైతుసేవా కేంద్రం నందు నామోదు చేసుకోవాలని రైతులకి సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, కౌలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సక్రమంగా వినియోగించుకోవాలి

మేకల తిరుమల రెడ్డి

విశాలాంధ్ర-రామచంద్రాపురం: ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే ఆ కుటుంబం సుభిక్షంగా ఉంటుందని స్వయం సహాయక సంఘాలకు వివిధ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసిందని మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమల రెడ్డి అన్నారు అందులో భాగంగానే గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు సహాయక సంఘాలకు రుణమేళా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండలంలోని 14 పంచాయతీ లల్లో 79 మహిళా సంఘాలకు పది కోట్ల నాలుగు లక్షల రూపాయల ఋణాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఋణాలను ప్రతి మహిళ సక్రమంగా వినియోగించుకోవాలి అలాగే తమ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఆర్డిఏ పిడి శోభన్ బాబు మాట్లాడుతూ ప్రతి మహిళ కూడా జీవనోపాధి వైపు మొగ్గు చూపాలని మీరు తయారు చేసిన ఉత్పత్తులు విస్తృత స్థాయిలో ప్రచారం చేయడానికి ప్రభుత్వాలు సిద్ధం గా ఉందని ప్రతి మహిళ గొప్ప వ్యాపార వేత్త గా ఎదగాలి అదేవిధంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎదుగేందుకు ప్రోత్సాహం చూపాలని బ్యాంకు అధికారులను కోరారు అనంతరం 79 మహిళా సంఘాలకు కుప్పంబాదూరు, రామచంద్రాపురంలలో ఉన్న సప్తగిరి గ్రామీణ బ్యాంకులు నెత్తకుప్పం యూనియన్ బ్యాంకు ద్వారా పదికోట్ల నాలుగు లక్షల రూపాయల రుణాలను చెక్కులను మహిళ లకు అందించారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చేకూరి జనార్దన్ చౌదరి .రావిళ్ళ గిరిబాబు నీలకంఠ చౌదరి. కొట్టే నరసింహారెడ్డి. కొట్టే ధనుంజయ రెడ్డి,తాతిరెడ్డి వెంకటేష్ రెడ్డి,సోము రాయలు .డి హరిప్రసాద్ ,సుబ్రహ్మణ్యం యాదవ్, బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు జనార్ధన్ నాయుడు డివి డిఆర్డిఏ. పిడి శోభన్ బాబు.. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ ఏజీఎం.కిషోర్ పట్నాయక్. ఏరియా కోఆర్డినేటర్ వనజాక్షి. సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్లు రాధాకృష్ణ, రాము. డి డి ఆర్ డి ఎ బి ఎల్. ఆదినారాయణ. ఎంపీడీవో ఇంద్రమ్మ. ఏపిఎం గురుమూర్తి, సిసి పార్వతమ్మ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బాలికల ఉజ్వల భవిష్యత్తుకి కిశోరి వికాసం దోహదం

ఐసిడిఎస్ సిడిపిఓ శోభారాణి

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణవనం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం నందు ఇన్చార్జి ఎంపీడీవో శేఖర్ ఆధ్వర్యంలోకిషోర్ వికాసం సంబంధించిన శిక్షణా కార్యక్రమం నిర్వహించబడినది ఈ కార్యక్రమంలో కిషోర్ బాలికలకు సంబంధించిన వివిధ విషయాలు అనగా బాల్యవివాహాలు రక్తహీనత బాలల అక్రమ రవాణా బాలలపై వేధింపులు ఋతుక్రమ పరిశుభ్రత సఖీ ఉమెన్ హెల్ప్ లైన్ సఖి వన్ స్టాప్ సెంటర్ మహిళా మిత్ర మరియు సైబర్ మిత్ర మొదలగు అంశాలపై శిక్షణ ఇవ్వబడినది కిషోర్ బాలికల స్వీయ రక్షణ కోసం నేర్చుకోవలసిన వివిధ వివిధ మార్గాలను కూడా ఈ శిక్షణలో తెలియజేయడం జరిగినది బాల్యవాహాల వలన కలుగు నష్టాలు రక్తహీనత నుంచి అధిగమించడానికి మరియు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు చైల్డ్ హెల్ప్ లైన్ వన్ స్టాప్ సెంటరు బాలల అక్రమ రవాణా నుండి రక్షించుకునే విధానము మొదలగు అంశంపై కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ డిఇఓ ప్రభాకర్ రాజు ఏపిఎం మమతా పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్ దర్శత్ రాజు ప్రజా ప్రగతి ట్రస్ట్ నుండి వేణు గోపాల్ చెంచు కృష్ణారెడ్డి గంగయ్య తెలియజేశారు ఈ కార్యక్రమంలో సచివాలయం సంబంధించిన వెల్ఫేర్ అసిస్టెంట్లు అంగన్వాడీ టీచర్లు నోడల్ టీచర్లు మొదలగువారికి శిక్షణ ఇవ్వబడింది ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ బేబీ మరియమ్మ శ్రీదేవి సుమతి తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

- ఆకట్టుకున్న కోలాటాలు-బోనాలు - సాంప్రదాయ దుస్తువులతో హాజరైన అధికారులు, విద్యార్థులు

విశాలాంధ్ర-కార్వేటినగరం: మన సంస్కృతి సంప్రదాయలకు ప్రతీకగా చేసుకునే సంక్రాంతి సంబరాలతో జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) లో ఛాత్రోపాధ్యాయుల సందడితో అంబరాన్నంటాయి. దీంతో డైట్ ఆవరణంలో పండుగ వాతవరణాన్ని తలపించింది. సంక్రాంతిని పురస్కరించుకుని గురువారం ముందస్తుగా సంభరాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు డైట్ ఆవరణాన్ని మామిడి ఆకుల రణాలు, చెరకు గడలు, పూల దండలు, గాలిపటాలు, రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే తెలుగు సాంప్రదాయ ప్రకారం భోనాలు వండి షఢ్రుచులతో కూడిన వంటకాలు వండి అమ్మవారికి నైవేధ్యం సమర్పించారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ సంక్రాంతి సంభరాల్లో పాల్గొని అధ్యాపకులకు ఛాత్రోపాధ్యాయులకు ప్రసాదాలను పంచిపెట్టి ఆనందంగా గడిపారు. అందరు కలసి ఏర్పాటు చేసిన భోగిమంటలు పలువురిని ఆకట్టుకుంది. భోగిమంటల చుట్టు అధ్యాపకులు కూడా ఛాత్రాపాధ్యాయులతో కలసి గొబ్బిళ్ళు తట్టడం తెలుగు సాంప్రదాయాన్ని తలపించింది. అనంతరం డైట్ ఆవరణంలో ఛాత్రోపాధ్యాయులు కోలాటాలు, కర్రబిళ్ల, కర్రసాము. నాలుగు స్తంబాల ఆట, గోళీలాట, బొంగరాలు, వైకుంఠపాళి వంటి ఆటలతో చూపరులను ఎంతో ఆకట్టుకున్నారు. అలాగే ఓ విద్యార్ధిని ప్రిన్సిపాల్ను శోధి చెప్పడం మరింత ఆకట్టుకుంది. అదే విధంగా సంక్రాంతి సాంప్రదాయ ప్రకారం గోపూజ నిర్వహించారు. తెలుగు దనం ఉట్టిపడేలా తెలుగు, తమిళం ఛాత్రోపాధ్యాయులు కలసి ఆడుకోవడం చూసిన ప్రిన్సిపాల్ ఇలాంటి అహ్లాదకరమైన వాతావరణంలో విద్యనభ్యసించడం పిల్లలయొక్క అదృష్టమని కొనియాడారు. ఛాత్రోపాధ్యాయులు విద్యతోపాటు అన్నిరంగాల్లోను రాణించాలంటే కార్వేటినగరం డైట్లోనే సాధ్యమన్నారు. ఈ క్రమంలో భాగంగా సంక్రాంతి సంబరాలకు ముఖ్య అతిధిగా పాల్గొన్న విశ్రాంతి సీనియర్ అధ్యాపకులు జయరామనాయుడుని ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం, అధ్యాపకులు దేవప్రసాద్, చెంగల్ రాజు, రెడ్డివెంకటరమణ, నాగరాజునాయక్, శ్రీనివాసులు, ప్రభాకర్, మహమద్ రఫీ, నిర్మల, సునీత, అనీత, అలాగే కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కరుణాకర్ రెడ్డి శవ రాజకీయాలు మానుకో: ఎమ్మెల్యే ఆరణి

విశాలాంధ్ర-తిరుపతి: వైకుంఠ ద్వార దర్శనం టికెట్స్ కోసం జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. తొక్కిసలాటలో గాయపడి పద్మావతి మెడికల్ కాలేజిలో చికిత్స పొందుతున్న భక్తులను ఆయన గురువారం ఉదయం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ భక్తుల మనోభావాలను కించపరిచేలా మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వైసిపి కి ప్రతిపక్ష హోదా కూడా ప్రజలు ఇవ్వలేదన్న సంగతి కరుణాకర్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలని ఆయన అన్నారు. ఈ ఘటన పట్ల చింతించాల్సింది పోయి బుద్ధి లేకుండా కరుణాకర్ రెడ్డి శవ రాజకీయాలు చేస్తున్నాడని ఆయన విమర్శించారు. ప్రధాని మోది సహా పలువురు నాయకులు భక్తులు మృతి చెందిన ఘటనపట్ల చింతిస్తుంటే కరుణాకర్ రెడ్డి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను విమర్శించే స్థాయి కరుణాకర్ రెడ్డికి లేదని ఆయన విమర్శించారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు 25లక్షలు ఎక్స్ గ్రేసియ ప్రకటించిందని ఆయన తెలిపారు.

తిరుపతి ఘటనలో ప్రాణం కోల్పోయిన ప్రతి మనిషికి కోటి రూపాయలు ఇవ్వాలి: టి.రాకేష్ కిరణ్

విశాలాంధ్ర-పుత్తూరు: నారాయణ వనం తిరుపతి విషాద ఘటనకు పూర్తి బాధ్యత కూటమి ప్రభుత్వానిదే. సత్యవేడు నియోజకవర్గం వైసీపీ సీనియర్ నాయకులు టి.రాకేష్ కిరణ్ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలి. ఘటన జరిగి అరగంటకు ఆలస్యంగా వచ్చిన అంబులెన్స్ శ్రీవారి భక్తులపై ఎందుకు ఈ వివక్ష. గతంలో ఎన్నడు ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్న దాఖలు లేవు. భక్తుల ఆర్తనాధాలతో ఆధ్యాత్మిక నగరం బీతిల్లింది. దైవ దర్శనానికి వచ్చిన భక్తులును తమ బంధువులు మృతదేహాలతో ఊరు వెళ్లాల్సిన దుస్థితి వైకుంఠ ఏకాదశి స్వామివారి దర్శనానికి భక్తులను ఏకంగా దేవుడు వద్దకి పంపించిన ఘనత ప్రభుత్వాన్నిది. శ్రీవారిని చూడవలసిన భక్తులు అయ్యో దేవుడా అని బోరుగా వినిపిస్తున్నారు తోపులాట రోడ్డుపై నిర్జీవ పడి ఉన్న మృతదేహాలను చూస్తుంటే అందరిని కంటి తడి పెట్టిస్తున్నాయి. ప్రభుత్వానికి భక్తులంటే ఇంత నిర్లక్ష్యమా. ఇకనైనా తీరు మార్చుకుంటారా లేక ఇదేవిధంగా భక్తులు ప్రాణాలతో చెలగాటం మారతారు.గాయపడ్డ భక్తులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలి మృతిచేదించిన ఒక్కొక్క కుటుంబానికి నష్ట పరిహారంతో పాటు, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి టిటిడిలో ఉద్యోగం కల్పించాలి గతంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు గోదావరి పుష్కరాలు ఘటన, నేడు అదే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలకి తిరుపతి శ్రీవారి భక్తులు 6 గురు మృతి చెందిన ఘటన కుటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి భక్తులపై అశ్రద్ధ వహించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడటం ఎంతవరకు సమంజసం. ఇన్ని ఘటనలు జరిగినా ప్రభుత్వంలో మార్పు రావడం లేదు. తిరుపతి ఘటనపై ఉన్నత స్థాయి సంస్థలతో దర్యాప్తు చేపించాలి అని సత్తివేడు నియోజకవర్గం సీనియర్ నాయకులు రాకేష్ కిరణ్ డిమాండ్ చేశారు.

తిరుపతి ఘటనపై పారిశ్రామిక వేత్త దలవాయి శ్రీనివాసులు దిగ్భ్రాంతి

విశాలాంధ్ర-తిరుపతి: వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల కోసం క్యూలో వేచి ఉండి తొక్కిసలాటలో ఆరుమంది భక్తులు మృతి చెందటం పట్ల చిత్తూరు మాజీ ఎంపీ, టిటిడి పాలక మండలి మాజీ చైర్మన్ ఆదికేశవులు నాయుడు కుమారుడు, పారిశ్రామిక వేత్త దలవాయి శ్రీనివాసులు తన ప్రగాఢ సంతపాన్ని, బాధను వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర సంఘటన పట్ల ఆయన దిగ్భ్రాంతి చెందారు. ఏడుకొండల స్వామిని దర్శించుకోవాలని తిరుపతికి వచ్చి ఇలా అనుకొని విధంగా తొక్కిసలాటలో చనిపోవటం చాలా బాధాకరం అని పేర్కొన్నారు. దర్శనం టిక్కెట్లు కోసం వెళ్లి క్యూ లైన్లో తిరుపతి స్థానికులు కూడా చాలామంది గాయపడ్డం పట్ల విచారం వ్యక్తం చేశారు. తన వంతు వ్యక్తి గత సాయంగా మృతుల కుటుంబాలకు ఆరు మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చొప్పున ఆరు లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేయనున్నట్లు వెల్లడించారు.

కమ్యూనిటీ భవనానికి భూమి పూజ

విశాలాంధ్ర-జిడి నెల్లూరు: గంగాధర నెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో కమ్యూనిటీ భవనం నిర్మాణం కోసం గురువారం భూమి పూజ జరిగింది. జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జెసిఐ) చిత్తూరు గోల్డ్ శాఖ ఆర్థిక సాయంతో భవన నిర్మాణం చేపట్టారు. సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా ఈ నిర్మాణం చేపట్టామని జెసిఐ అంతర్జాతీయ కమిషన్ ఛైర్మన్ ఎన్ బి హర్షవర్ధన్ రెడ్డి, జోన్ ఛైర్మన్ టి.భరత్, వైస్ ఛైర్మన్ కె ప్రమోద్ చెప్పారు. సకాలంలో నిర్మిస్తామని చిత్తూరు చాప్టర్ అధ్యక్షులు ఎం వి శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి వి చిరంజీవి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గా దేవి, కమమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.శ్రీనివాసులు, సూపర్వైజర్ శైలజ జెసిఐ చిత్తూరు చాప్టర్ మాజీ అధ్యక్షులు జి కె మనోహర్, జి కె మానస తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయుధం విద్య మాత్రమే

ఘనంగా భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్

విశాలాంధ్ర-గూడూరు: ఆధునిక భారత మహిళా విద్యా ప్రదాతలు సావిత్రీబాయి ఫూలే, ఫాతిమా షేక్ లని ఐసీడీఎస్ సీడీపీఓ షేక్ మహబూబి అన్నారు. గురువారం గూడూరు సీఎస్ఎం ఉర్దూ పాఠశాలలో భారతదేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 194వ జయంతి వేడుకలను ఇన్సాఫ్ సమితి ఆధ్వర్యంలో సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ కాలేషా అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ షేక్ మహబూబి మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా పోటీపడుతున్నారన్నారు. సావిత్రీబాయి ఫూలే, ఫాతిమా షేక్ కలిసి 18వ శతాబ్దంలోనే బాలికా విద్యను ప్రోత్సహించేందుకు పునాది వేశారన్నారు. దేశంలో పాఠశాలలు ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలు, బాలికలకు విద్యనందించడం వలనే మహిళలు నేడు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదన్నారు. ఫాతిమా షేక్ ను ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆల్ ఇండియా తన్జీమ్ ఏ ఇన్సాఫ్ ఏపీ స్టేట్ డిప్యూటీ సెక్రటరీ షేక్ జమాలుల్లా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉన్నతంగా ఎదిగేందుకు ఏకైక ఆయుధం విద్య మాత్రమేనన్నారు. పేద విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గూడూరు పట్టణంలో సీఎస్ఎం హైస్కూల్, జీఎస్ఆర్ఎం హైస్కూళ్లలో ఉర్దూ పోస్టుల భర్తీకి ప్రజా ప్రతినిధులు, అధికారులతో చర్చించి తమ వంతు కృషి చేస్తామన్నారు. బీఎస్పీ సీనియర్ నాయకులు నాశిన భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ ఫాతిమా షేక్ జీవిత చరిత్ర మహారాష్ట్ర రెండవ తరగతి పాఠ్యాంశంలో ఉందని, ఆంధ్ర రాష్ట్రంలోను అలాగే దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో పాఠ్యాంశంగా చేర్చాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇన్సాఫ్ సమితి సలహాదారులు, మైనారిటీ నాయకులు ఎండీ. అన్వర్ బాష మాట్లాడుతూ అగ్రవర్ణ పెత్తందారుల ఆధిపత్య సమాజంలో స్త్రీలు విద్యకు నోచుకోని 18వ శతాబ్దంలో ఫాతిమా షేక్, ఉస్మాన్ షేక్ లు ఫూలే దంపతులకు పాఠశాల కోసం సొంత ఇంటిని ఇవ్వడమే కాకుండా ఉపాధ్యాయ శిక్షణ పొంది ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలుగా కీర్తి గడించారన్నారు. వారి త్యాగాలు, సేవలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎం సీనియర్ నాయకులు, ఏపీఎస్పీడీసీఎల్ విశ్రాంత ఉద్యోగి టీ. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సుమారు 200 ఏళ్ల క్రితం సావిత్రీబాయి ఫూలే, ఫాతిమా షేక్ ల సేవలు విశ్వం ఉన్నంతవరకూ మరిచిపోలేనివన్నారు. మైనారిటీ వర్గాల్లో స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన ఎంతోమంది యోధులున్నారని, వారందరి త్యాగాలు, పోరాటాలను నేటి సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా ఇన్సాఫ్ సమితి కృషి చేయాలని సూచించారు. అంతకుముందు ఫాతిమా షేక్, సావిత్రీ బాయి ఫూలే చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు పెన్నులు, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ప్రముఖ చరిత్ర పరిశోధకులు రచించిన సావిత్రీబాయి ఫూలే పుస్తకాలను విద్యార్థులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మహబూబి, సీపీఎం సీనియర్ నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, షేక్ కాలేషా, నాశిన భాస్కర్ గౌడ్, ఎండీ. అన్వర్ బాష, టీ. వెంకట్రామిరెడ్డి, షేక్ జమాలుల్లా, వలీ అహ్మద్, షేక్ హాషిం, సయ్యద్ మదార్, ఉర్దూ స్కూల్ ఉపాధ్యాయులు సుభాని, జమీర్, హుస్నా, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎల్. స్వరూపరాణి, అంగన్వాడీ కార్యకర్త నాగూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓపెన్ డే

విశాలాంధ్ర-పుత్తూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం గురువారం ఓపెన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాల గురించి భవిష్యత్తు లక్ష్యాల గురించి అవగాహన కల్పించడం కోసం ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసింది. ఈ సభలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలరాజు చంద్రమౌళి మాట్లాడుతూ ఓపెన్ డే అనేది విద్యార్థులకు ఉన్నత విద్యపై అవగాహన పెంచడమే కాక విద్యార్థులలో సృజనాత్మకతను ప్రోత్సహించే వేదిక అని, ప్రతి విద్యార్థి తమ ప్రతిభను గుర్తించి లక్ష్యసాధనలో కృషి చేయాలని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలను ఎలా ఏర్పరచుకోవాలి డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు వాటి ప్రయోజనాలను మొదలైన అంశాలను వివరించారు.ఎస్సారెస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఓపెన్ డే కార్యక్రమం విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రేరణగా ఉపయోగకరంగా ఉందని అన్నారు నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్.శ్రీలత మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు సాధించగలమనే నమ్మకం విద్యార్థులకు కలిగిందన్నారు. అనంతరం వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల గ్రంథాలయ సౌకర్యాలను వ్యాయామశాలను బాటని జువాలజీ ఫిజిక్స్ కెమిస్ట్రీ బయోటెక్నాలజీ మైక్రోబయాలజీ కంప్యూటర్ సైన్స్ తదితర లేబరేటరీ సౌకర్యాలను పరిశీలించారు. డిగ్రీ కళాశాల సైన్స్ అధ్యాపకులు కొన్ని ముఖ్యమైన ప్రయోగాలను చేసి విద్యార్థులకు వివరించారు ఇంటర్మీడియట్ విద్యార్థులు తమకు కలిగిన సందేహాలను అడిగి డిగ్రీ అధ్యాపకుల నుండి వివరణాత్మకమైన సమాధానాలను పొందారు డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఓపెన్ డే కార్యక్రమం వల్ల ఇంటర్ విద్యార్థులలో మంచి ఆసక్తి అవగాహన కలిగిందని జూనియర్ కళాశాల. అధ్యాపకులు అభిప్రాయపడ్డారు. ఇంటర్మీడియట్ విద్యార్థులైన మాకు డిగ్రీ విద్యను గురించి ప్రొఫెషనల్ కోర్సులను గురించి భవిష్యత్తు అవకాశాల గురించి మరింత స్పష్టతను పొందామని వివిధ కళాశాలల ఇంటర్మీడియట్ విద్యార్థిని విద్యార్థులు స్పందించారు ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కోటేశ్వరయ్య, వి.వీరయ్య, టి.నరసింహులు, డాక్టర్ పి.సుజన, డాక్టర్ ఎం.శ్రీనివాసులు లోకనాథం, ధనంజయ, గిరిప్రకాష్, సుగీత తదితర అధ్యాపకులు ఎస్సారెస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నాగలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల, పిచ్చాటూరు జూనియర్ కళాశాల, నారాయణ వనం జూనియర్ కళాశాల, గోపాలకృష్ణ పురం జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-పాకాల: పాకాల మండలంలోని దామలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం లయన్స్ క్లబ్ ప్లాటినం ఆధ్వర్యంలో ముగ్గురు పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా శుక్రవారం నుండి పాఠశాలకు సంక్రాంతి సెలవులు కావడంతో సంక్రాంతి సంబరాలు భాగంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీ లు నిర్వహించారు. ఈ ముగ్గుల పోటీలో 52 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చక్కగా ముగ్గులు వేసిన వారికి లైన్స్ క్లబ్ ప్లాటినం అధ్యక్షులు తులసి రామ్ చేతుల మీదుగా బహువతులు ప్రధానం చేశారు. ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులతో పాటు కన్సలేషన్ బహుమతులు అందజేశారు. సంక్రాంతి సంస్కృతి, నైపుణ్యము, శాస్త్రీయ భావాన్ని గురించి లయన్స్ క్లబ్ సభ్యులు కుప్పుస్వామి నాయుడు తెలియజేశారు. జాతీయ భావం, పర్యావరణ పరిరక్షణ పెంపొందించుటకు విద్యార్థులు శ్రద్ధచూపాలని, పర్యావరణ ప్రాముఖ్యత పరిరక్షణ విషయాలు వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు రామయ్య, జీవి ప్రసాద్, కెఎస్ మస్తాన్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ భూసేకరణలో రూ.100కోట్ల స్కామ్

అభివృద్ధి పేరుతో రూ.10 కోట్ల కుంభకోణం - ఇసుక అక్రమ రవాణాతో కోట్లలో దోపిడీ

వెలుగులోకి మాజీ ఎమ్మెల్యే మధు అవినీతి - సీఎం చంద్రబాబు దృష్టికి ఈ స్కామ్

ఈ స్కామ్ లోని ఎవరినీ వదిలేది లేదు : ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి వెల్లడి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జగనన్న కాలనీ భూసేకరణ పేరుతో రూ.100 కుంభకోణం జరిగింది. ఇది ఒక్క ఊరందూరు జగనన్న కాలనీలో మాత్రమే. కాలనీలో అభివృద్ధి పేరుతో మరో రూ.10 కోట్ల స్కామ్ చేశారు. ఇళ్ల నిర్మాణాల పేరుతో ఇసుకను డంప్ చేసి అక్రమ రవాణా ద్వారా కోట్ల రూపాయలను దోపిడీ చేశారు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అవినీతి, అక్రమాలు ఒక్కోక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ అవినీతి కుంభకోణాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళుతున్నాం. ఈ స్కామ్ లో సూత్ర, పాత్రదారులెవరినీ వదిలే ప్రసక్తే లేదని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామ సమీపంలోని జగనన్న కాలనీలో గురువారం జరిగిన విచారణ సదస్సులో ఈ వివరాలను ఎమ్మెల్యే వెల్లడించారు. పేదలకు ఒక సెంటు వంతున పంపిణీ చేసిన జగనన్న లేఔట్ ఏర్పాటుకు భూసేకరణ చేశారని తెలిపారు. అందుకు గాను రైతుల నుంచి సేకరించిన భూమికి సుమారు రూ.250 కోట్లు చెల్లించగా ఇందులో 40 శాతం ఎమ్మెల్యే తన వాటాగా తీసుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన పరిహారంలో ఆ శాతం ఆ రోజే ఒక బ్యాంకు నుంచి మరో బ్యాంకునకు బదిలీ కాగా అక్కడ నగదును తీసుకున్నాని తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని అధారాలు సేకరించామని చెప్పారు. ఇలా ఒక్క ఊరందూరు లేఔట్ భూసేకరణలోనే రూ.100 కోట్ల కుంభకోణం చేశారని వివరించారు. అలాగే ఈ కాలనీలో అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యుత్, రోడ్లు, మంచి నీటి సౌకర్యం పేరుతో కూడా స్కామ్ జరిగిందన్నారు. విద్యుత్ సౌకర్యం కోసం రూ.5కోట్లు మంజూరు కాగా ఖర్చు మాత్రం రూ.60 నుంచి రూ.70 వరకు చేశారని చెబుతున్నారని తెలిపారు. మిగిలిన నగదు ఎక్కడా అంటే సమాధానం దొరకడం లేదన్నారు. అలాగే మంచినీటి వసతి కోసం రూ.20లక్షలు మంజూరు కాగా ఆరు బోర్లు వేసి నాలుగు మోటార్లు బిగిస్తే ఇప్పుడు రెండు మాత్రమే పనిచేస్తున్నాయని చెప్పారు. ఇందులోనూ భారీగా అవినీతి జరిగిందన్నారు. ఎన్ఆర్ఐజీఎస్ కింద ఒక్కో ఇంటికి రూ.18వేలు లెక్కన మంజూరు కాగా ఇందులో కూడా భారీ అవినీతి చోటుచేసుకుందని తెలిపారు. ఇక గృహ నిర్మాణాల కోసం కమ్మి, సిమెంటులోనూ అవినీతి, అక్రమాలు జరిగాయని వివరించారు. పరిశ్రమల నుంచి ఈ కాలనీలో స్టీల్ ను తీసుకొచ్చి డంప్ చేసి ఫోటోలు తీసుకుని తిరిగి మళ్లీ అదే పరిశ్రమకు దానికి తరలించి బిల్లుల రూపంలో వారి నుంచి నగదు తీసుకున్నారని ఆరోపించారు. సిమెంటు విషయంలోనూ లెక్కలు తారు మారు చేసి దోచేశారని ఆరోపించారు. వర్షం వల్ల సిమెంటు తడిసిపోయి గడ్డకట్టేసినట్లుగా పాత ఫోటోలు చూపి మసిపూడి మారేడుకాయ ఇందులోనూ అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. ఈ కాలనీలో ఇళ్ల నిర్మాణాల పేరుతో ఇసుకను డంప్ చేసి తమిళనాడు, కర్నాటకకు అక్రమంగా రవాణా చేసి కోట్లాది రూపాయలు దోచుకున్నారన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అవినీతి, అక్రమాలను ఒక్కోక్కటిగా బహిర్గతం చేస్తామన్నారు. ఈ అవినీతి కుంభకోణాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళుతున్నట్లు చెప్పారు. ఇందులో సూత్ర, పాత్రదారులెవరినీ కూడా వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ అవినీతి, అక్రమాలకు సంబంధించి సమగ్ర విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు. నివేదిక రూపకల్పన తర్వాత మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితోపాటు తప్పులు చేసిన అధికారులు జైలుకు పోవడం తప్పదన్నారు. అధికారులకు ఒక అవకాశం ఇస్తున్నానని వారు చేసిన తప్పులను స్వయంగా అంగీకరించి వివరాలను అందించాలని సూచించారు. రాజీవ్ నగర్, వికృతమాల, చిందేపల్లిలోని జగనన్న లేఔట్ లకు సంబంధించిన వివరాలను సేకరించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రంగినేని చెంచయ్య నాయుడు, మునిరాజు నాయుడు, పాపిరెడ్డి, లక్ష్మీనారాయణ పొన్నారావు,కామేష్ యాదవ్, రవీంద్రనాథ్ రెడ్డి, కన్నలి ప్రతాపరెడ్డి, షాకీర్ అలీ, శ్రీకాళహస్తి తాసిల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ గిరి కుమార్, ఎంపీడీవో రఫీ, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మాదవి, పత్తికొండ నియోజకవర్గం శాసనసభ్యులు కేఈ శ్యామ్ కుమార్ వేర్వేరుగా వారి కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా

మొక్కలు నాటాలి

- ఎమ్మెల్యే బొజ్జల

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి కోరారు. సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం గుంటక్రింద పల్లి గ్రామంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. మొక్కలు నాటిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని గుర్తు చేశారు. పొల్యూషన్, గ్లోబల్ వార్మింగ్ తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిర్వర్తించాలన్నారు. రోడ్ల వెంబడి, పొలం గట్ల మీద, ఖాళీ ప్రదేశాలలో విరివిగా మొక్కలు నాటాలని, వాహనాల వాడకాన్ని తగ్గించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం గురించి గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు జయప్రకాష్, దేవా, మల్లీశ్వరి, సేవ్ ఆక్సిజన్ సభ్యులు లోకేష్, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

పోలీసులను లెక్క చేయని జగన్

.... పోలీసుల సూచనను బేఖాతర్ ....

విశాలాంధ్ర బ్యూరో - తిరుపతి : వైకుంఠ ఏకాదశి సందర్భంగా టికెట్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో గాయపడిన వాళ్ళని పరామర్శించేందుకు వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి గురువారం సాయంత్రం తిరుపతికి చేరుకున్నారు. అదే సమయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పద్మావతి వైద్య కళాశాలలో గాయపడ్డ వారిని పరామర్శిస్తున్నారు. దీంతో పోలీసులు అరగంట ఆలస్యంగా రావాలని వైఎస్ జగన్‌కి సూచించారు. అయితే పోలీసుల సూచనను ఆయన వినిపించుకోలేదు. దీంతో రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుపతి నగరంలోకి వస్తున్న జగన్ కాన్వాయ్ ని తిరుచానూరు సర్కిల్ వద్ద పోలీసులు నిలిపివేశారు. దీనిపై ఆగ్రహం చెందిన జగన్ తన వాహనం నుండి దిగి నడుచుకుంటూ బయలుదేరారు. తర్వాత పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన వాహనంలో ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. అదే సమయంలో పవన్ కళ్యాణ్ పద్మావతి ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడుతూ వున్నారు. జగన్ రాకతో అటు జనసేన కార్యకర్తలు జై జనసేన అంటూ... ఇటు జై జగన్ అంటూ వైసీపీ కార్యకర్తలు నినాదాలతో హెూరెత్తించారు. ఆసుపత్రి వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. పవన్ కళ్యాణ్ మీడియా సమావేశం అనంతరం అక్కడి నుండి వెళ్ళిపోయారు. ఆసుపత్రి లో బాధితులను పరామర్శించిన అనంతరం జగన్ బయట వచ్చి మీడియాతో మాట్లాడారు.

తిరుపతి ఘటన పై ఎంపీ దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి

విశాలాంధ్ర -చిత్తూరు : తిరుపతి ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాదరావు వ్యక్తం చేశారు. తిరుపతిలో జరిగిన విషాద ఘటన నేపథ్యంలో తన పుట్టినరోజు వేడుకలకు దూరమయ్యారు. వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తొక్కిసలాటలు చోటు చేసుకున్న ఘటనలో భక్తులు మృతి చెందడం ఆవేదన కలిగించిందని, భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం పాలవడం దురదృష్టకరమని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు సూచించారు. తిరుపతిలో తొక్కిసలాట ఘటన పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టిడిపి శ్రేణులెవ్వరూ..తన పుట్టినరోజు వేడుకలను జరపొద్దు అంటూవిజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాలకు తామంతా అండగా నిలుద్దామని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు.

ట్రెక్ చిత్తూరు కార్యక్రమానికి ఎమ్మెల్యేను ఆహ్వానించిన ఎఫ్ఆర్వో

విశాలాంధ్ర - పలమనేరు : అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రెక్ చిత్తూరు కార్యక్రమానికి విచ్చేయాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డి ని స్థానిక ఎఫ్.ఆర్.ఓ నారాయణ ఆహ్వానించారు. ఈనెల 12న పలమనేరు అటవీ పరిధిలోని మొగిలి వద్దనున్న దేవరకొండలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. కాబట్టి ఉదయం 6 గంటలకు కార్యక్రమానికి విచ్చేసి ప్రారంభించాలని ఆయన కోరారు. తదనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కుంకి ఏనుగుల ప్రాజెక్టు, గంగన్న శిరస్సు ప్రాజెక్టు తదితర అంశాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఫారెస్ట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.